క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

18న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 18న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఈవో పేర్కొన్నారు.

ఘనంగా పరదేశమ్మ వారం



పరదేశమ్మ తిరువీధి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: అల్లిపురం ప్రజల ఆరాధ్య దైవం, అమ్మవారివీధిలో వెలసిన కొత్తమ్మవారి నెల రోజుల పండగ ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పరదేశమ్మ వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిమలతో భక్తులు పాత జైలురోడ్డు నుంచి డప్పు వాయిద్యాలతో అల్లిపురం మెయిన్‌రోడ్డు, కుమ్మరవీధి, అమ్మవారివీధి తదితర ప్రాంతాల్లో తిరువీధి చేపట్టారు. అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు.

వైభవంగా గంధోత్సవం



దర్గాలో బాబాకు నివాళులు అర్పిస్తున్న భక్తులు

అల్లిపురం: యాతపేటలోని ఖామూష్ బాబా దర్గాలో మంగళవారం వైభవంగా గంధోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు గంధం సమర్పించిన అనంతరం, చాదర్, పూలతో అలంకరించారు. అనంతరం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అన్సార్ వల్లీ, రంజన్, మదీనా తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు ఆర్థిక సాయంపై హర్షం



మాట్లాడుతున్న కార్పొరేటర్ డాక్టర్ మహ్మద్ సాధిక్

జగదాంబ : హజ్ యాత్రికులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక ఆర్థిక సాయం కింద రూ.14.51 కోట్ల నిధులు విడుదల చేస్తూ జీవో జారీ చేయడం హర్షణీయమని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు, కార్పొరేటర్ డాక్టర్ మహ్మద్ సాధిక్ అన్నారు. మంగళవారం విశాఖలో మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 1814 మంది హజ్ యాత్రికులపై పడిన పెనుభారాన్ని ప్రభుత్వమే భరించి ముస్లిం యాత్రికులకు భారీ ఊరట కల్పించినట్లు తెలిపారు. విజయవాడ గన్నవరం నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న యాత్రికులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో 80 వేల రూపాయలు ప్రభుత్వం జమ చేసిందన్నారు. ముస్లిం సోదరుల ఉన్నతికి అనేక సేవలందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ఈ సందర్భంగా మహ్మద్ సాధిక్ కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గుపొడి.. సమస్యల జడి

- ఎక్కడ చూసినా బొగ్గే
- ప్రతి వేసవిలోనూ దక్షిణ ప్రజలకు తప్పని బాధ
- ఆరోగ్యాలు పాడవుతున్నాయని ఆవేదన

నియోజకవర్గంలో ప్రజలు బొగ్గుపొడితో అవస్థలు పడుతున్నారు. తినే తిండిలో బొగ్గు.. తాగే నీటిలో బొగ్గు.. కూర్చునే కుర్చీపై బొగ్గు.. చూసే టీవీపై బొగ్గు.. ఎక్కడ చూసినా బొగ్గే. ఇదీ దక్షిణ నియోజకవర్గం పరిస్థితి. నెల రోజులుగా విపరీతంగా బొగ్గు వచ్చి పడుతోందని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అల్లిపురం: పోర్టు నుండి బొగ్గు ఎగిరి రావటంతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇంట్లో రోజుకి నాలుగుసార్లు తడిగుడ్డ పెట్టినా మళ్లీ క్షణాల్లో బొగ్గు పొడి పేరుకుంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో కోట వీధి, పాతనగరం, అల్లిపురం, కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట, భూపేష్‌నగర్, వెంకటేశ్వరమెట్ట, బంగారుమెట్ట తదితర ప్రాంతాల ప్రజలు బొగ్గు పొడి ఎగిరి రావటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా శ్వాస కోస వ్యాధులు ప్రబలుతున్నాయని, ఆరోగ్యాలు పాడైపోతున్నాయని వాపోతున్నారు. మొక్కల ఆకుల మీద రూపాయి మందంలో బొగ్గు పేరుకుపోతుంది. ప్రశాంతంగా ఏమైనా తిందామంటే భయమేస్తుందంటున్నారు.



కిటికీలపై పేరుకున్న బొగ్గు పొడి (ఇన్‌సెట్) తుడిచిన చేతికి అంటుకున్న నల్లటి ధూళి



వాషింగ్ మెషిన్‌పై పేరుకుపోయిన ధూళిని చూపిస్తున్న మహిళ

ఎక్కడ చూసినా బొగ్గే..



ఇంట్లో ఎక్కడ చూసినా బొగ్గే. 24 గంటలు బొగ్గు తినాల్సి వస్తుంది. బొగ్గు పీల్చాల్సి వస్తుంది. పిల్లలకు రోగాలు వస్తాయని భయమేస్తుంది. ఇంట్లో నడిచినా పాదాలకు నల్లటి బొగ్గు అంటుకుంటుంది. బట్టలు బయట ఆరబెట్టాలంటే భయమేస్తోంది. ప్రజా ప్రతినిధులు ఎన్నికలకు ముందు కాలుష్యం నుండి నియోజకవర్గాన్ని రక్షిస్తామని హామీలు గుప్పించారు. గెలిచి మూడేళ్లు అవుతున్నా సమస్య తీరలేదు.

– డి.భారతి, బంగారుమెట్ట

ఆరోగ్యాలు పాడవుతున్నాయి



బొగ్గుతో కూడిన గాలి పీల్చటం వల్ల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. తలుపులు మూసుకుని ఇంట్లోనే ఉండాల్సి వస్తుంది. పెద్ద వయస్సు వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇంట్లో సామాన్లు రోజుకి పదిసార్లు తుడవాల్సి వస్తుంది.

– నీలాపు అయ్యప్పరెడ్డి, అమ్మవారివీధి

ఏ వస్తువు బయట పెట్టినా ధూళే



ఇంటి బయట బండి పెట్టి ఇంట్లోకి వెళ్లి వచ్చే సరికి దుమ్ము పేరుకుపోతుంది. సాయంత్రం చల్లగాలికి ఆరుబయట కూర్చుందామంటే కూర్చోలేని పరిస్థితి. శ్వాసకోస వ్యాధులు పెరిగిపోతున్నాయి.

– పాల శ్రీహరిరెడ్డి, కుమ్మరవీధి, అల్లిపురం

విద్యార్థులు రీడింగ్ యాప్ ఉపయోగించుకోవాలి



వేసవి శిబిరానికి హాజరైన విద్యార్థులు



విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పుతున్న రిసోర్స్‌పర్సన్ శ్రీనివాస్

డాబాగార్డెన్స్: విద్యార్థులు గూగుల్ రీడ్ అలాంగ్ యాప్‌ను ఉపయోగించుకోవాలని సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డి. సంజీవకుమార్ తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో పఠన నైపుణ్యం పెంపొందింపజేసేందుకు రీడ్ అలాంగ్ యాప్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ ఇతర భాషల్లో కథలు ఉంటాయని తెలిపారు. తప్పులు చదివినప్పుడు దియా అనే యానిమేషన్ తప్పులు సరి చేస్తుందన్నారు. విద్యార్థులకు నీతి కథలు బోధించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయాధికారి రాజేంద్రవర్మ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రకళలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మోహనరావు

చిత్రకళలో బాలలకు శిక్షణ

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బాలల శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కసింకోట జిల్లా పరిషత్ హైస్కూల్ డ్రాయింగ్ మాస్టర్ సీహెచ్ మోహనరావు పాల్గొని పిల్లలకు డ్రాయింగ్‌పై మెలకువలు నేర్పారు. అలాగే వీ లవ్ రీడింగ్ ప్రోగ్రాంలో భాగంగా సమగ్రశిక్షణ, ఆల్టర్నేటివ్ స్కూలింగ్ కో ఆర్డినేటర్ వి. శైలజ గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి, 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు పెయింటింగ్‌లో శిక్షణ

అల్లిపురం: అల్లిపురం శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు యు లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా రీసోర్స్ పర్సన్ శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులకు కథలు చెప్పడం, చిత్రలేఖనంలో మెలకువలు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పీవీఎస్ రాజు, సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ



డయాగ్నోస్టిక్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మహారాణిపేటలోని లయ డయాగ్నోస్టిక్స్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధరల పట్టికను ప్రదర్శించాలని, ఫారం-ఎఫ్ పూర్తిగా నింపాలని, పేదవారికి ఫీజులు తగ్గించి పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో పలు సూచనలు చేశారు. అనంతరం సీబీఎం కాంపౌండ్‌లో గల విశాఖ ఈఎన్‌టీ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌కి సంబంధించిన ధ్రువపత్రాలు పరిశీలించి యాజమాన్యానికి పలు సూచనలు చేశారు. డాక్టర్ ఎస్.రమారెడ్డి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, ఎల్.కోటేశ్వరరావు, నాగభూషణం పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- నేర నియంత్రణలో తోడ్పాటు అందించాలి
- సమావేశంలో సీపీ త్రివిక్రమ్‌వర్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి : ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ హామీ ఇచ్చారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్, ఏడీసీపీ (ట్రాఫిక్) అరీఫుల్లాతో కలిసి నగర ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. అలాగే స్థానిక పోలీసులతో పూర్తి సమన్వయంతో నేరాల నియంత్రణ విషయంలో తోడ్పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ-1 ఎం.జాన్‌మనోహర్, ట్రాఫిక్ ఏసీపీ-2 రాజీవ్‌కుమార్‌తో పాటు వివిధ ఆటో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాలకు బాధ్యులెవరు?



సదస్సులో మాట్లాడుతున్న సీహెచ్ నర్సింగరావు

అల్లిపురం: రాష్ట్రంలో పారిశ్రామిక ప్రమాదాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాలకు కారణాలు ఏమిటి? వీటికి బాధ్యులెవరు? అనే అంశంపై అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులకు పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని, పరిశ్రమల్లో భద్రతా పరికరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై భవిష్యత్ పోరాటాల ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సదస్సు ద్వారా పిలుపునిచ్చారు. సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పీపుల్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జగదీష్ పటేల్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు జి.కోటేశ్వరరావు, కేఎం శ్రీనివాస్, తేజేశ్వరరావు, ఫార్మా యూనియన్ నాయకులు రొంగలి రాము, రక్షణ రంగ యూనియన్ నాయకుడు నాగేశ్వరరావు, వివిధ పరిశ్రమల్లో ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటర్ పరీక్షల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. లయన్స్ క్లబ్ సహకారంతో విద్యార్థులకు ఈ నెల 22వ తేదీ వరకూ నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులందరికీ భోజనం అందిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఈ మేరకు లయన్స్ క్లబ్ ప్రతినిధులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నాగమణి, అధ్యాపకులు సన్యాసినాయుడు, ఆర్.పి.నాయుడు, విమల, పుష్పలత, ఇందిర పాల్గొన్నారు.

అవగాహనతోనే డెంగ్యూ దూరం



కొబ్బరితోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డెంగ్యూ అవగాహన ర్యాలీ



భీమ్‌నగర్ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో డెంగ్యూ అవగాహన ర్యాలీ



దొండపర్తి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో డెంగ్యు అవగాహన ర్యాలీ

అల్లిపురం: జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కొబ్బరితోట అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలోను, భీమ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలోను ర్యాలీ నిర్వహించారు. కొబ్బరితోట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వికాష్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి వైరస్ ద్వారా సంభవిస్తుందన్నారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. డెంగ్యూ జ్వరం ప్రమాదకరమైన జబ్బు అని తెలిపారు. ఈ వ్యాధి నియంత్రణ మన చేతుల్లోనే ఉందన్నారు. వారంలో ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం కొబ్బరితోట, లక్ష్మీదేవిపేట, అచ్చియ్యమ్మపేట ప్రాంతాల్లో ర్యాలీ చేపట్టారు.

భీమ్‌నగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..

భీమ్‌నగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పూతివారి మాన్యం, బంగారుమెట్ట, నీలమ్మవేపచెట్టు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు నర్మద, భారతి మాట్లాడుతూ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు రాకుండా చూసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దొండపర్తిలో..

సీతమ్మధార: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దొండపర్తి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ఎస్ కార్తీక్ ముఖ్య అతిథిగా పాల్గొన్ని ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కుమ్మరివీధి, చుక్కావారివీధి, పాలికలవీధి, రజకవీధి, హరిజన వీధుల్లో ర్యాలీ కొనసాగించారు. నీటి నిల్వ తొలగించండి, దోమల ఉత్పత్తిని నివారించండి, దోమకాటు ఆరోగ్యానికి చేటు అంటూ నినాదాలు చేశారు. జిల్లా మలేరియా విభాగం ఆరోగ్యక కార్యకర్త లంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎన్ఎంలు సుశీల, శ్రీదేవి, క్రిష్ణవేణి, దివ్య, లోవకుమారి, నిర్మలకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా ముగ్గురు అమ్మవార్ల పండగ



పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ

డాబాగార్డెన్స్: నగరంలోని 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ, 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

బంగారమ్మ పండగ..

పితానిదిబ్బలో వెలసిన బంగారమ్మ పండగ మహోత్సవాలు ఈ నెల 14న ప్రారంభమయ్యాయి. మంగళవారం అనుపుతో ఉత్సవాలు ముగిసాయి. ఆదివారం పండగ చాటింపు, 15న సోమవారం తొలేళ్ల ఉత్సవం, 16న ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో గరిడీలు, పులివేషాలు, తప్పిటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పితానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, ఖానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ పండగ మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు జరిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారిని సదుంపట్టు(ఆర్టీక్లబ్ గొల్లలపాలెం) నుంచి ధూప దీప నైవేద్యాలతో, బాజా భజంత్రీలతో తప్పెటగుళ్లు, చెక్కభజన, పులివేషాలు, సాముగరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 23న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 4న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి కమిటీ ప్రతినిధులు తెలిపారు.

దుర్గాలమ్మ పండగ..

జీవీఎంసీ 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ పండగ మహోత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించారు. ప్రధాన పండగ మంగళవారం రోజున అమ్మవారికి విశేష పూజలు జరిపారు. కృష్ణాగార్డెన్స్, ప్రేమసమాజం ఏరియా, డాబాగార్డెన్స్, నారాయణ వీధి, భానువీధి, లక్ష్మీవీధి, నీలమ్మ వేపచెట్టు ఏరియా తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ నాగేశ్వరరావు

డాబాగార్డెన్స్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో రాంనగర్‌లో గల విశాఖ సేవా సదన్ పాఠశాలలో మంగళవారం దశ దిన సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభమైంది. ప్రముఖ న్యాయవాది సత్యనారాయణ శిబిరాన్ని ప్రారంభించారు. సంస్కృత ప్రాముఖ్యతను వివరించారు. శిబిరం నిర్వహిస్తున్న సంస్కృత భారతిని అభినందించారు. అనంతరం సంస్కృత భారతి ఆంధ్ర ప్రాంత సంపర్క్ ప్రముఖ్ ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ పది రోజుల్లో సులభంగా సంస్కృతం మాట్లాడడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలన్నారు. సంస్కృతం తెలియడం వల్ల మిగిలిన భాషలు సులభంగా మాట్లాడగలమని చెప్పారు. ఈ నెల 25 వరకు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. వయసుతో పని లేదని, ఆసక్తి గల వారు ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కార్యదర్శి డాక్టర్ మల్లాది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని, ప్రమాదాలకు గురైన ఫిషింగ్ బోట్లకు నష్టపరిహారం ఇవ్వాలని ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ కోరారు. మంగళవారం బాపట్ల జిల్లా నిజాంపట్నంలో 'వైఎస్సార్ మత్స్యకార భరోసా' నిధులు అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. మత్స్యకారులకు డీజిల్ సబ్సిడీ విడుదల చేయాలని, విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఐదు సంవత్సరాలుగా పాకిస్తాన్ జైల్లో శిక్ష అనుభవించి విడుదలైన మత్స్యకారులకు గతంలో ఇచ్చిన విధంగానే రూ. 5 లక్షల జీవనభృతి అందించాలని కోరామని.. ఈ సమస్యల పట్ల సీఎం జగన్ సానుకూలంగా స్పందించినట్లు జానకీరామ్ తెలిపారు.

రైల్వేకాలనీలో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేకాలనీలో పర్యటిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం : రైల్వేకాలనీలలో అందుతున్న వసతులు, సదుపాయాలను తెలుసుకునేందుకు వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మంగళవారం రాత్రి మర్రిపాలెం రైల్వే కాలనీలో పర్యటించారు. రైల్వే స్థలాల పరిరక్షణ, అనధికార వాహన పార్కింగ్, ఓవర్ హెడ్ ట్యాంక్, అనధికార మతపరమైన నిర్మాణం గురించి ఆరా తీశారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనీవాసులకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీస్థలాలలో బారికేడ్లు ఏర్పాటుచేసి స్థలాలను పరిరక్షించాలన్నారు. కాలనీలో ఇతరుల పార్కింగ్‌ను కట్టడి చేయాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట సీనియర్ డివిజనల్ ఇంజినీర్(హెడ్ క్వార్టర్స్) ఎస్కే సారంగి, అసిస్టెంట్ ఇంజినీర్ కే నాగేశ్వర్రావు, ఎలక్ట్రికల్, సివిల్ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్, కామర్స్ కళాశాల హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే దిశగా సిబ్బంది చిత్త శుద్ధితో పని చేయాలని చీఫ్ వార్డెన్ డాక్టర్ జి.వీర్రాజు అన్నారు. హాస్టల్ కార్యాలయంలో ఆయన ఉద్యోగులతో సమావేశమయ్యారు. ప్రధానంగా మెస్ పరిసరాలు, వంట శాలలో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

ఉద్యోగులు క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పని చేయాలని చెప్పారు. విద్యార్థులకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడమే లక్ష్యంగా ప్రతి వ్యక్తి పని చేయాలన్నారు. ఉద్యోగులకు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు. సమష్టిగా పని చేస్తూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన ఆరోగ్యకరమైన వాతావరణాన్ని తీర్చిదిద్దాలన్నారు.

స్టోర్స్ నిర్వహణ, కిరాణా, కూరగాయలు వంటివి నిత్యం పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. హాస్టళ్లకు వచ్చే నిత్యావసర వస్తువుల్లో నాణ్యత లోపం ఉంటే తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. వర్సిటీ నిర్దేశించిన విధంగా హాస్టళ్లకు కిరాణా వస్తువులు, కూరలు వంటివి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లు రమణ మూర్తి, బుజ్జిబాబు, హాస్టల్ కార్యాలయం సూపరింటెండెంట్, తదితరులు పాల్గొన్నారు.